ప్రగతి రథచక్రాలకు పటిష్టమైన గూడు

- సర్వాంగ సుందరంగా నరసాపురం బస్టాండ్
- రూ.4 కోట్లతో బస్టాండ్ ఆధునికీకరణ
- డిపో సెక్షన్ అభివృద్ధికి రూ.80 లక్షలు
- కార్పొరేట్ తరహాలో నిర్మాణం


కార్పొరేట్ తరహాలో నిర్మించిన నరసాపురం బస్టాండ్

నరసాపురం: నరసాపురం పట్టణానికి చేరుకోగానే ఒకప్పుడు మెయిన్‌రోడ్డులో శిథిలావస్థలకు చేరిన పాత బస్టాండ్ భవనం కనిపించేది. ఇప్పుడు కార్పొరేట్ హంగులతో అన్ని సౌకర్యాలతో అధునాతన బస్టాండ్ భవనం కనిపిస్తోంది. మొత్తం రూ.4.80 కోట్లు నిధులతో చేపట్టిన బస్టాండ్ పునర్నిర్మాణం , అలాగే డిపో సెక్షన్ అభివృద్ధి పనులు పరిస్థితిని మొత్తం మార్చేశాయి, ఉన్నో ఏళ్లుగా గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురైన బస్టాండ్ నేడు కార్పొరేట్ హంగులతో ప్రయాణీకుల అన్ని విధాలా సౌకర్యవంతంగా ఉంటుంది. ముందు రూ 4 కోట్లతో బస్టాండ్ అభివృద్ధి పనులు గత ఏడాది చేపట్టారు. మళ్లీ డిపో సెక్షన్‌లో ప్లాట్‌ఫామ్ అభివృద్ధి, కొత్తా షెడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం మరో రూ.80 లక్షలు మంజూరు చేసింది. బస్టాండ్ పునర్నిర్మాణ పనులు పూర్తికావడంతో 2022 నవంబర్ 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నరసాపురం పర్యటనలో బస్టాండ్‌ను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రత్యే కృషితో బస్టాండ్ పునర్నిర్మాణం సాధ్యమైంది. డిపోలో చేపట్టిన పనులు కూడా తుది దశకు చేరాయి.

జిల్లాలో కీలకమైన డిపో

ఉమ్మడి పశ్చిమలో నరసాపురం ఆర్టీసీ డిపో కీలకమైనది. అత్యధిక సర్వీస్‌లతో వెలుగొందేది. ఆర్టీసీ సర్వీస్‌లు ప్రారంభమైన తొలినాళ్లోనే జిల్లాలో నరసాపురం డిపో ఏర్పడింది. ఒకప్పుడు జిల్లాలో అత్యధిక ఆదాయం తెచ్చే డిపోల్లో నరసాపురం ముందు వరుసలో ఉండేది. కాలక్రమేణా డిపో అభివృద్ధిని పట్టించుకోకపోవడ, నియోజకవర్గంలో దీర్ఘకాలం పాటు ప్రాతినిధ్యం వహించిన టీడీపీ ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోకపోవడంతో డిపో వైభవం కోల్పోతూ వచ్చింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చే నాటికి బస్టాండ్ పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. దాదాపుగా శిథిలావస్థకు చేరింది. 35 ఏళ్ల నుంచి బస్టాండ్‌లో ఎలాంటి మరమ్మతులు కూడా సాగలేదు. దీంతో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి చొరవతీసుకుని బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు.

రూ 4.80 కోట్లతో బస్టాండ్ పునర్నిర్మాణం

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో బస్టాండ్ పునః నిర్మాణం కోసం ముందు ప్రభుత్వం రూ.4 కోట్లు నిధులు మంజూరు చేసింది. పాత భవనాన్ని కూల్చేసి దాని స్థానంలో కొత్తగా బస్టాండ్ భవనాన్ని రెండస్థుల్లో నిర్మించారు. పై అంతస్తులో డిపో మేనేజర్ కార్యాలయం, పరిపాలనా భవనాలను ఏర్పాటు చేశారు. విజయవాడ, భీమవరం తరహాలో బస్టాండ్ ప్లాట్‌ఫామ్‌లు వత్తాకారంలో ఉండేలా నిర్మాణం పూర్తిచేశారు.

డిపోకు పూర్వవైభవం



ప్రస్తుతం బస్టాండ్‌ను, డిపోను కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేశాం. సౌకర్యాలు పెంచాం . అలాగే ఇక ఇక్కడి నుంచి గతంలో నడిచే అనేక దూర సర్వీస్‌లు రద్దయ్యాయి. వాటిని తిరిగి పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నాం. నరసాపురం ఆర్టీసీ డిపోకు పూర్వవైభవం తీసుకొస్తున్నాం.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్

క్రమంగా సర్వీస్‌ల పెంపు



డిపో నుంచి సర్వీస్‌లు క్రమంగా పెంచుతున్నాం. మొగల్తూరు, మచిలీపట్నం మీదుగా హైదరాబాద్ వెళ్లే విధంగా ఇటీవల కొత్త సర్వీస్ ప్రారంభించాము. బస్టాండ్‌లో ప్రయాణీకుల వసతులు పెంచాము. శుభ్రమైన మంచి నీరు. మంచి కుర్చీలు ఇలా అన్ని సదుపాయాలు పెంచాం. డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించి ప్రయాణికుల సలహాలుతో ముందుకు వెళ్తున్నాం.

– ఎస్.సుబ్బన్నరెడ్డి, డిపోమేనేజర్

క్లుప్తంగా

వైభవంగా కనకదుర్గమ్మ విగ్రహప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ విగ్రహం

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గ్రామం కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని మిరియాల గాంధీ, మిరియాల వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.

వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం లక్ష్మీ నరసింహావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా చిత్రగుప్తుని నోములు


నోముల్లో పాల్గొన్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో చిత్రగుప్తుని నోములు, గ్రామ కుంకుమ నోములు నిర్వహించారు. స్థానిక చినకూరగాయల మార్కెట్‌లో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నోములు నిర్వహ/ంచారు. కార్యక్రమంలో జిల్లా పాస్ట్ గవర్నర్ శ్రీకాకోళపు మైథిలి, జోన్ చైర్మన్ చీదెళ్ల మహాలక్ష్మి, అన్నం నాగ వెంకట సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అతిరుద్ర మహాయాగం

పోడూరు: కవిటం గ్రామంలో 14 రోజుల పాటు నిర్వహించిన శ్రీ సహస్ర చండీ సహిత మహా సౌర పూర్వక చతుర్వేద స్వాహాకార సహిత దశమహా విద్యాపూర్వక అతిరుద్ర మహాయాగ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు అతిరుద్ర యాగ పూర్ణాహుతిని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆధ్యాత్మిక వేత్త జంధ్యాల శ్రీనివాసశర్మ(నెలమూరు శర్మ), కవిటం సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, మేడపాటి రామచంద్రారెడ్డి, మేడపాటి రామారెడ్డి, పడాల వెంకట సత్యనారాయణరెడ్డి, బాలాజీ రెడ్డి, గుడిమెట్ల రామకనకారెడ్డి, కర్రి గంగాధర రెడ్డి తదితరులు యాగ నిర్వహణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

వీరవాసరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వీరవాసరం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసి చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు (బాబు) మాట్లాడుతూ మండలంలోని గ్రామాల పురోభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజా సమస్యలపై మండల స్థాయి అధికారులు తక్షణం స్పందించాలని సూచించారు. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీఓ విజయబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు అడ్డాల శ్రీరామ్ చంద్రమూర్తి, బోను జోత్స్నాదేవి, నాగరాజు పద్మకల, పెంటకోటి సైదేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

పాలకోడేరు: రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన అవసరం న్యాయవాదులు డి.రాధ, బివి సూర్యస్వాతిలు తెలిపారు. శనివారం విస్సాకోడేరులో మాతా శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీస్ సిబ్బంది సీహెచ్ విజయ, న్యాయవాది బీ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాన్ గూటెన్ బర్గ్‌కు ఘన నివాళి


గూటన్ బర్గ్ జయంతి సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రణ యంత్ర సృష్టికర్త జాన్ గూటన్ బర్గ్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక భవానీ డిజిటల్ ప్రింటింగ్ ప్రెస్ ఆవరణలో గూటెన్ బర్గ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత సూర్యనారాయణ మాట్లాడుతూ 1398 ఫిబ్రవరి 24న జన్మించిన గూటెన్ బర్గ్ మొట్టమొదటి సారి స్వర్ణకారుడిగా జీవితాన్ని ప్రారంభించారు. 1438లో ముద్రణ యంత్రాన్ని కనుగొని ప్రథమంగా 42 లైన్ల బైబిల్‌ను ముద్రించి తన నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాడన్నారు. ఆయన జన్మించిన రోజును ప్రింటర్స్ డేగా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం సూర్యనారాయణ కేక్ కట్ చేసి మిత్రులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ముత్యాల రామారావు, కొత్తపల్లి శ్రీనివాస్, కాటంరెడ్డి నాగశ్రీను, యాదంరెడ్డి చిన్ని, తోట శ్రీను, అంగర నరసింహరావు, గంధం ఏసుపాదం, గజ్జరపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టపర్రులో వాలీబాల్ కోర్టు ప్రారంభం


మట్టపర్రులో వాలీబాల్ క్రీడాకారులతో గ్రామ కమిటీ అధ్యక్షుడు కొల్లాబత్తుల రవికుమార్

పోడూరు: మట్టపర్రు ఆదిఆంధ్ర పేటలో స్థానిక యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టును శనివారం వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షులు కొల్లాబత్తుల రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందడంతో పాటు యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఉంటారన్నారు. స్నేహభావం పెంపొందుతుందన్నారు. వాలీబాల్ కోర్టు కోసం వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి దాదాపుగా రూ.15వేల విలువైన ఇసుకను అందజే యడం పట్ల రవికుమార్, యూత్ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కుసుమె సుభాకర్, నేలపాటి రత్నంరాజు, వేడంగి జగదీష్, వేడంగి సురేష్, కలిగితి హరి, నల్లిమిల్లి స్వామి, బండి నాగశంకర్, ఉన్నమట్ల సతీష్, కుసుమె కిరణ్, నేలపాటి చిన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు, డ్రెయిన్‌ల నిర్మాణానికి శంకుస్థాపన


సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: స్థానిక గ్రామపంచాయతీ పరిధిలో పల్లపువీధిలో రూ. 5లక్షలు మండల పరిషత్ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రైనేజీ పైపులైన్ విస్తరణ పనులు చేపట్టేందుకు ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరుకు ఆదేశాలు జారీ చేసిన మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చింతపల్లి మంగాదేవి, ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి, మండల యువజన భాగం అధ్యక్షులు కొవ్వూరి అధ్యక్షుడు కొవ్వూరి నాగమోహన్‌రాజారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదలకు పక్కా ఇళ్లు


ఎన్నార్పీ అగ్రహారంలో రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

ఉండి: గత ప్రభుత్వాల సమయంలో గృహనిర్మాణ రుణాలు పొంది చెల్లించని వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన్‌టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్)తో ఎంతో మందికి మేలు జరిగిందని ఎన్నార్పీ అగ్రహారం సర్పంచ్ సూరవరపు కనకదుర్గ, ఎంపీటీసీ మున్నలూరి సువర్ణలక్ష్మీ అన్నారు.గ్రామంలోని 77 మంది ఓటీఎస్ లబ్ధిదారులు 60 మందికి డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు ఎంతో మేలు చేశారన్నారు. త్వరలోనే మిగిలిన లబ్ధిదారులకు కూడా రిజిస్ట్రేషన్ చేసి డాక్యుమెంట్లు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూరవరపు వెంకటాచార్యులు, కార్యదర్శి జేవీటీ నాయుడు, పంచాయతీ కార్యవర్గ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా గీతామందిర ప్రతిష్ఠ


గీతామందిర ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: మండలంలోని రాజులపేటలో పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి, స్వయంభూ మహిషాసుర మర్ధిని ఆలయంలో పునః నిర్మాణం చేపట్టిన గీతామందిరాన్ని దత్తపీఠం నాగానంద సరస్వతీ స్వామీజీ చేతుల మీదుగా ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, మండపారాధనలు, పుష్పాదివాసం, జలాధివాసం, అగ్నిప్రతిష్ఠాపన, మూలమంత్రహోమం, మూర్తి హోమంపూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ, ఆలయ ప్రధానార్చకులు సన్నిధిరాజు కృష్ణ, సన్నిధిరాజు శేషగిరి,ఆలయ చైర్మన్ అయినంపూడి రామకృష్ణంరాజు, మాజీ చైర్మన్ రుద్రరాజు వరలక్ష్మీ, పాకలపాటి రామరాజుపండితులు సన్నిధిరాజు చలపతిరావు, టీ సాయి,టీ కిరన్ ,వై ఫని, దీపు, ఎస్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెలివెలలో వలంటీర్లకు వందనం


వెలివెలలో వలంటీర్లను సత్కరిస్తున్న సర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్లు చేస్తున్న కృషి అభినందనీయమని సర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు ప్రశంసించారు. పాలకొల్లు మండలం వెలివెల గ్రామ సచివాలయంలో శనివారం గ్రామంలో ఉత్తమ సేవలందించి సేవా వజ్ర అవార్డు అందుకున్న కాకర్లమూడి ప్రియాంక, అలాగే సేవా మిత్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లు ఉన్నమట్ల వెంకటేశులు, కందుల అనితకుమారి, మన్నె జయశ్రీ, కండిబోయిన ధనలక్ష్మి, పెదపాటి వసంతకుమారి, బూసి మనోజ్, గెడ్డం శ్రావణి, బండి రేవతి, అధికారి కృష్ణమోహన్‌లను సర్పంచ్ వెంకటేశ్వరరావు, అధికారులు శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం సేవా కిషోర్, వీఆర్వో శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ మన్నె కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పండాకు తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలి


గుంపర్రులో వరిచేలను పరిశీలిస్తున్న మార్టేరు వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు

యలమంచిలి: వరి పంటలో పండాకు తెగులు ఎక్కువగా కనిపిస్తుందని, దీని నివారణకు రైతులు సత్వరమే చర్యలు తీసుకోవాలని మార్టేరు వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రామభద్రరాజు కోరారు. గుంపర్రులో వరిచేలను శనివారం మార్టేరు వరిపరిశోధనా శాస్త్రవేత్తల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా రామభద్రరాజు మాట్లాడుతూ ఈ తెగులు నివారణకు 19–19–19, లేదా 17–17–17 లిక్విడ్ రూపంలో వస్తున్న మందును ఎకరానికి కిలో చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ వరిపంటలో జింక్ లోపం కూడా ఉందని, దీని నివారణకు లిక్విడ్ రూపంలో వస్తున్న 33 శాతం జింక్‌ను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పీవీ రమణారావు, ఎస్.వీరోనిక, మండల వ్యవసాయాధికారి సీహెచ్ దేవి, రైతులు జడ్డు బదరీనారాయణ, గణపాబత్తుల ఏసుబాబు, పితాని కోటేశ్వరరావు, కడలి మురళి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో గ్రామోత్సవం


పెనుగొండలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: స్థానిక లింగాల వీధిలోని ఉమాసోమేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. పెనుగొండ లింగాల వీధిలో ఏ ప్రాంతంలో తవ్వినా లింగాలు వస్తాయనే నానుడి ఉండడంతో ఉమాసోమేశ్వర స్వామి వారికి విశిష్టత ఉంది. ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠ మహోత్సవాలు కొతరపు వెంకటేశ్వర్లు బ్రహ్మత్వంలో, ఆలయ అర్చకులు చేబోలు పవన్ శర్మ వేద మంత్రాలతో ప్రారంభించారు. స్వామి వార్ల విగ్రహాలను పెనుగొండలో ఉదయం నుంచి కేరళ వాయిద్యాలు, కోలాటాలు, శివ అఘోరాల నృత్యాలు, మేళతాళాలతో కనుల పండువగా నిర్వహించారు. ఈ నెల 29న విగ్రహ పునః ప్రతిష్ఠ నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి


భీమవరంలో పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జడ్జి సురేష్‌బాబు

భీమవరం: మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో భీమవరం ఒకటో అదనపు సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్‌లో ఉన్న పాలకోడేరు, వీరవాసరం, కాళ్ళ పోలీస్ స్టేషన్స్‌కు సంబంధించిన క్రిమినల్ కేసులు, భీమవరం ఎక్సైజ్ స్టేషన్‌లకు సంబంధించిన కేసులను రాజీ చేసి కక్షిదారులకు సమన్యాయం అందించడానికి కృషి చేయాలని ఒకటో అదనపు సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు అన్నారు. శనివారం తన చాంబర్‌లో పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి బాధితులు, ముద్దాయిలకు సమన్యాయం జరిగేలా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. అన్ని కోర్టుల్లోనూ ముందస్తు లోక్ అదాలత్ బెంచ్‌లను నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. లోక్‌అదాలత్‌కు ప్రత్యక్షంగా హాజరుకాలేని వారు వర్చ్యువల్‌గా హాజరు కావచ్చునన్నారు.

దిరుసుమర్రులో..

భీమవరం అర్బన్: ప్రతి చిన్న సమస్యకూ పోలీస్ స్టేషన్, కోర్టులకు వెళ్లకుండా గ్రామ స్థాయిలో పెద్దల సమక్షంలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్యానల్ లాయర్ డి.రవి కిరణ్ అన్నారు. మండలంలోని దిరుసుమర్రులో శనివారం మార్చి 9న జరిగే జాతీయ లోక్‌అదాలత్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

మానవుని ఆలోచనలే పరిశోధనకు దోహదం

భీమవరం:మానవుని మంచి ఆలోచనలే పరిశోధకునిగా మారుస్తాయని ఇండియన్ సర్వర్ సీఈఓ ఎం .సాయిసతీష్ చెప్పారు. శనివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన స్ఫూర్తి 23–24 జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియంలో ఆయన మాట్లాడారు. ఇంజినీర్‌లోని వినూత్న ఆలోచనలే సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం అవుతాయన్నారు. ప్రపంచమంతా ప్లాస్టిక్ వినియోగంలో ఉన్నా మనదేశంలో మాత్రం ప్లాస్టిక్‌ను ఉపయోగించి రోడ్ల నిర్మాణం చేపట్టడంలో ప్రపంచంలో నెంబర్ వన్ స్థాయిలో విజయం సాధించిందని సాయి సతీష్ చెప్పారు. ఇన్నోవేషన్‌తో అద్భుత ఫలితాలు సాధించవచ్చునన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం .జగపతిరాజు మాట్లాడుతూ ప్రపంచానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలంటే సివిల్ మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి అన్ని విభాగాలుంటేనే సాధ్యమవుతుందన్నారు. అందువల్లే ప్రభుత్వం మల్టీ డిసిప్లినరీ కోర్సులకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సీఎస్సీ హెడ్ వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభకు సింపోజియం ఒక వేదికగా నిలుస్తుందన్నారు. అనంతరం సాయిసతీష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జీఎస్‌వీ శిరీష, కేవీ కృష్ణంరాజు, జె.రజనీకాంత్, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యలమంచిలి: మండలంలోని ఇలపకుర్ర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కొత్త స్తంబాలు పాతుతున్న కారణంగా ఆది, సోమవారాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అవసరమైనప్పుడల్లా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ బి.సురేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా దొడ్డిపట్ల, ఇలపకుర్రు, మట్లపాలెం, అబ్బిరాజుపాలెం, బూరుగుపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాల్లో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

27న పేరుపాలెం బీచ్‌లో కార్యక్రమాల వాయిదా

నరసాపురం: పేరుపాలెం బీచ్‌లో 27వ తేదీ మంగళవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ, వైఎస్సార్ స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమాలు వాయిదా వేసినట్టు ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయా కార్యక్రమాలు త్వరలోనే నిర్వహిస్తామని, దానికి సంబంధించిన తేదీలను త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కంచర్లవారి వీధిలో సుఖీభవ నర్సింగ్ హోమ్‌లో ఏవీఎస్ ఆసుపత్రి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు ఎస్.రామారావు శనివారం విలేకరులకు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో కాళ్ల సిరల వాపు వ్యాధి (వేరికోస్ వెయిన్స్) కీళ్ల నొప్పికి, మోకాలి నొప్పులకు ఉచిత వెరికోస్ వెయిన్స్ స్క్రీనింగ్ చేయనున్నట్లు తెలిపారు. అదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తత అవసరం


పాలకొల్లు బస్టాండ్ ఏరియాలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కేవైఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రవికిరణ్ సూచించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడేనికి చెందిన మిరియాల రవిబాబు బృందం శనివారం మండలంలోని ఉల్లంపర్రు, పాలకొల్లు బస్టాండ్ ఏరియాల్లో వీధి నాటికలు ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఐసీటీసీ సెంటర్ల ఆవశ్యకత, ఏఆర్టీ మందుల ప్రాధాన్యత, హెచ్ఐవీ టోల్ ఫ్రీ నంబర్ 1097 పై ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛంద సంస్థ సిబ్బంది ఎం.సుజాత తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార నిర్వహణకు తోపుడు బండి అందజేత


నిండాల పుష్పలతకు తోపుడుబండి అందజేస్తున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: ఇతరులకు సహాయం చేసినప్పుడు వారి ముఖంలో కలిగే ఆనందం వెలకట్టలేనిదని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. పాలకొల్లు రూరల్ పంచాయతీ యాళ్ల వానిగరువులో నిండాల పుష్పలతకు నాలుగు చక్రాల తోపుడు బండిని తాతాజీ అందజేశారు. పుష్పలత గత కొంతకాలంలో అద్దె బండి తీసుకుని జొన్నపొత్తుల వ్యాపారం చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటోంది. అయితే తాతాజీని తోపుడు బండి ఇస్తే అద్దె భారం తగ్గుతుందని కోరడంతో ఆయన స్పందించి పుష్పలతకు తోపుడుబండిని తన సొంత ఖర్చులతో చేయించి శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయాల చైర్మన్‌లు కావలి శ్రీనివాసరావు, జోగి వెంకటేశ్వరరావు, నంబూరి శ్రీగంగాపవన్‌కుమార్, మామిడి వెంకటేశ్వరరావు (బాబు), వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పెచ్చెట్టి కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.